విజయ - జనవరి, 1986

"తాము నియమించిన ఉద్యోగులనుంచి తాము కోరేపని ఏదో తెలియని ప్రభుత్వ కార్యాలయాలు దేశంలో ఎన్నో ఉన్నాయి-"

# అదృష్టవంతులు

టైము అయిదయ్యే సరికల్లా భాస్కరావు లేచి కూర్చున్నాడు. రోజూ అంతే! ఆ టైముకతడికి మెలకువొచ్చేస్తుంది.

భాస్కరావు సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసరు. అతడికింద నలభైమంది గుమస్తాలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని వివిధ సంస్థల్లో... ప్రజలకేమైనా అసౌకర్యం కలిగితే భాస్కరావు ఆఫీసులో తెలియబర్చుకోవచ్చు. నలభైమంది గుమస్తాలు తమకు వచ్చిన పిటిషన్ కాగితాలను పరిశీలించి నోట్సు తయారుచేసి ఫైలుచేసి భాస్కరావుకు చూపిస్తారు. భాస్కరావు వాటిని ఆయా మంత్రుల కార్యాలయాలకు పంపుతాడు. భాస్కరావు నుంచి తరచు ఫిర్యాదులు వినడం ఏ మంత్రికీ యిష్టముండదు. ఆ ఫిర్యాదుల్లో మంత్రులకిబ్బంది కలిగించే విశేషాలు కూడా ఎన్నో ఉంటాయి.

అందుకే భాస్కరావు ఆఫీసులో నిద్ర అలవాటు చేసుకున్నాడు. రోజూ ఉదయం, సాయంత్రం కలిపి కనీసం నాలుగుగంటలైనా నిద్రపోతాడు. ఈ కారణంగా ఇంట్లో నిద్రపట్టదతడికి. నిద్రపట్టకపోతే బాధ లేదతడికి. అతడి భార్య రాధకు విపరీతమైన నిద్ర. రాత్రి తొమ్మిదయ్యేసరికి ఆమె కళ్ళు మూతలు పడిపోతాయి. ఆ తర్వాత ఉదయం ఏడింటిదాకా ఆమె కళ్ళు తెరవదు. మనిషి కదలదు. పొరపాటున భాస్కరావామెను కదిపాడో - మెలకువగా వున్నప్పుడు కూడా ఆమెను తాకే అర్హత కోల్పోతాడు.

రాధ అందమైనది. మనసు మంచిదే కాని మాట దురుసు. మనిషి దుడుకు, భాస్కరావు మొహమాటస్థుడు కావడం వల్ల ఆమె అతణ్ణి కొంగున ముడేసుకోగలిగింది. ఇంట్లో అన్నింటికీ ఆమె మాటే సాగాలి. అందుకామెకో అదనపు అర్హత కూడా ఉంది. రాధ కూడా సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగి. ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలన్నీ వంతులవారీగా చదివి ఆధునిక జీవితానికి పనికివచ్చే విశేషాలను వాటినుండి

సేకరించాలామె. హిందీ, ఇంగ్లీషు భాషలలో వ్యాసాలు వ్రాయగల శక్తి ఉన్నవారికే ఆ ఉద్యోగం. రాధ తెలుగే కాక ఆ రెండు భాషలలోనూ ప్రావీణ్యం సంపాదించుకున్నందు వల్లనే... ఉద్యోగమామెకు వచ్చింది. ఉద్యోగాన్ని బట్టి ఆమె ఆఫీసులో తెగ చదవాలి. అందువల్ల ఇంటికొచ్చేసరికి ఆమె బాలా అలసటగా ఫీలవుతుంది.

ఆ రోజు భాస్కర్రావాఫీసులో అతడి గదికి సున్నంవేసే కార్యక్రమముంది. అందువల్ల అతడు గుమస్తాలతోపాటు తనూ హాల్లోనే కూర్చోవాలి. అది భాస్కర్రావు కిష్టం లేదు. తను ఆఫీసరునన్న అహం అతడికి లేదు. నిద్రపోకుండా అతడుండలేడు. తన క్రింది ఉద్యోగుల మధ్య నిద్రపోవడం అతడికిష్టంలేదు. అందువల్ల ఆ రోజుకు సెలవు పెట్టాలని అతడనుకొన్నాడు. అందుకే నిన్న సాయంత్రం రాధకు చెప్పాడు మరునాడు సెలవు పెడదామని. రాధ ససేమిరా అంది.

"సెలవులిలా వృధా చేసుకోకూడదు. అవసరమైనప్పుడే ఉపయోగించుకోవాలి" అంటూ భర్తకామె పెద్ద ఉపన్యాసం కూడా యిచ్చింది.

భాస్కర్రావు నిరుత్సాహపడి ఆ రోజుకు తనూ పెందరాళే పడుకుని ఆలస్యంగా నిద్రలేవాలనుకున్నాడు. రాధ మామూలుగా తొమ్మిదింటికే పడుకుంది. పడుకోగానే శవంలా మారిపోయింది. ఎంత ప్రయత్నించినా భాస్కర్రావుకో పట్టాన నిద్రరాలేదు. మామూలుగా పదకొండే అయింది పడుకునేసరికి. ఆలస్యంగా లేద్దామనుకున్నాడు కానీ మళ్ళీ యిప్పుడు అయిదింటికి మెలకువొచ్చేసింది.

రాధ యింకా వళ్ళు తెలియకుండా నిద్రపోతోంది.

భాస్కర్రావు కాలకృత్యాలు నెరవేర్చుకున్నాడు. స్నానంకూడా అయ్యేసరికి టైము ఆరయింది.

పాలవాడు కాలింగ్‌బెల్ కొట్టాడు. భాస్కర్రావు గిన్నె తీసుకుని వెళ్ళి పాలు పోయించుకున్నాడు. తలుపు వేసుకోబోతుండగా... "అంకుల్!" అన్న గొంతు వినబడింది.

అప్పుడు చూసాడు భాస్కర్రావు. పాలవాడి వెనకనుంచి గోపీ ముందుకు వచ్చాడు. అప్రయత్నంగా భాస్కర్రావు ఎదురింటివైపు చూశాడు.

అక్కడ సీత వుంది. ఆమె భాస్కర్రావు వంక చూసి మనోహరంగా నవ్వింది. సీత చాలా అందంగా వుంటుంది. కానీ యింకా చాలా అందంగా నవ్వుతుంది. ఆమె నవ్వుకు భాస్కర్రావు చిత్తైపోతాడు.

సీత గోపీ అక్క. బియ్యే ఫైనలియర్లో ఉంది. ఆమెకు పుస్తకాలపిచ్చి. రోజూ ఆఫీసునుంచి వచ్చేటప్పుడు రాధను పలకరిస్తుంది సీత. ఆ విషయం ఈ విషయం అడిగినట్లడిగి రాధ దగ్గర ఏం పుస్తకాలున్నాయో తెలుసుకుంటుంది. కానీ రాధనేమీ అడగదు. పుస్తకాలివ్వనని రాధ నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. అందుకని మర్నాడుదయం గోపీని పంపి తను గుమ్మంలో నిలబడుతుంది. ఆ సమయానికి రాధ లేవదన్న విషయం అందరికీ తెలిసిన రహస్యం. రహస్య మెందుకంటే రాధ ముందెవ్వరూ ఆ నిజాన్ని తెలియనట్లే నటిస్తారు.

రాధలో ఏదో హుందాతనముంది. అంతా ఆమెకు భయపడతారు. అంతా ఆమెను గౌరవిస్తారు.

"ఏమిట్రా" అన్నాడు భాస్కరరావు గోపీ వంక తిరిగి.

"మీ దగ్గర ఆశాదీపం నవలుందిటగా... మా అక్కక్కావాలిట. చదివి సాయంత్రానికల్లా యిచ్చేస్తానంది...." అన్నాడు గోపి.

భాస్కరరావు ఇంటింటా స్వంతగ్రంథాలయంలో మెంబరు. అదికాక చాలా పత్రికలు కొంటాడు. అటుపైన రాధ రోజూ ఆఫీసునుండి వచ్చేటప్పుడు - స్నేహితులనడిగి కానీ - పుస్తకాల షాపునుంచి అద్దెకుకానీ పుస్తకాలు తెస్తుంది.

"చూస్తానుండు...." అని భాస్కరరావు లోపలకు వెళ్ళాడు.

బీరువాలో పుస్తకముంది. సీతకు పుస్తకాలిస్తే రాధ దెబ్బలాడుతుందని అతడికి తెలుసు. కానీ అతడికి మొహమాటం.

నవల తీసి గోపీకిచ్చి గుమ్మందాకా వెళ్ళాడతడు.

సీత అతడివంక కృతజ్ఞత నిండిన చూపులతో చూసింది.

ఆమె వెళ్ళిపోయాక భాస్కరరావు తలుపులు వేసుకున్నాడు. టైము ఏడయ్యేవరకూ అతడు శ్రద్ధగా పేపరు చూశాడు. పేపరుతోపాటు పత్రికలేవీ రాకపోవడం వల్ల అతడు పేపర్లో మైనర్ డిటెయిల్సు కూడా వదలకుండా చదివేశాడు.

ఏడింటికి అలారం మ్రోగింది. రాధ లేచింది.

అలారానికి బదులు భాస్కరరావే రాధను లేపవచ్చు. కానీ అందులో చాలా యిబ్బందులున్నాయి. సరిగ్గా ఏడింటికి లేపితే "ఇంకా మత్తుగా ఉందండీ... మరీ అంత ఏడంటే ఏడుకే లేపాలా!" అంటుంది రాధ. ఆలస్యంగా లేపితే "ఇంత ఆలస్యంగా లేపారు - ఇద్దరం ఆఫీసుకెళ్ళాలిగదా - ఇంటిపనులెలాగౌతాయి?" అని చిరాకు పడుతుంది. పెందరాళే నిద్ర లేపే ప్రసక్తి లేదు.

"మీకు నిద్రరాదు. నేను నిద్రపోతే చూడలేరు-" అని తరచుగా భార్య అనే మాటలు భరించలేక - "నేను నిన్ను నిద్ర లేపను, నీ కెప్పుడు లేవాలనుంటే అప్పుడు అలారం పెట్టుకుని లే!" అనేశాడు భాస్కరరావు.

ఇప్పుడు భాస్కరరావు తినే తిట్లన్నీ - అలారం టైంపీసు పడుతుంది.

రాధలేచి కాలకృత్యాలు తీర్చుకుని వంటింట్లోకి వెళ్ళింది. కాఫీ కలిపితెచ్చింది. భార్యాభర్తలిద్దరూ కాఫీలు తాగారు. తర్వాత భాస్కరరావు సాయం చేస్తుండగా ఆమె వంట చేసింది.

భోజనాలు చేయబోయే ముందు - ఇద్దరూ నువ్వు శ్రమ పడ్డావంటే నువ్వు శ్రమపడ్డావని పరస్పరం అభినందించుకున్నారు, భోజనాలైపోయాయి.

"వంట చాలా బాగుంది-" అన్నాడు భాస్కరరావు.

"మీరు సాయం చేయకపోతే - ఇంత బాగుండదు" అంది రాధ.

తర్వాత ఇద్దరూ ఆఫీసుకు రెడీ కాబోయారు. భాస్కరరావు తన బ్రీఫ్‌కేస్

సర్దుకుంటుండగా - "ఏమండీ?" అనే పొలికేక విని కంగారుగా పరుగున వెళ్ళాడు. రాధకు కరెంటుషాకేమైనా కొట్టిందేమోనని అతడు భయపడ్డాడు.

రాధ పుస్తకాల బీరువా ముందుంది.

"ఇందులో ఆశాదీపం నవల కనపడ్డంలేదు" అందామె.

భాస్కరావు గుండెల్లో రాయిపడింది - "ఏం?" అన్నాడు.

"అది నా స్నేహితురాలిది. ఈ రోజు రిటర్న్ చేస్తానని మాటిచ్చాను..."

"ఫరవాలేదు - సారీ చెప్పు"

"ఆమె పుస్తకాన్ని అద్దెకు తెచ్చుకుందండీ!" అంది రాధ.

"దాందేముంది? ఆ అద్దె మనమే యిచ్చుకుందాం...."

"అది కాదండీ - ఆ పుస్తకం పోయిందేమోనని అనుమానంగా వుంది...."

"పోతే - కొనిద్దాంలే..."

"మీరు కానీ ఎవరికైనా యిచ్చారా?" అంది రాధ విషయానికివస్తూ.

"నేనెవరికిస్తాను?"

"ఇంకెవ్వరు - ఆ సీతకి?"

రాధ ఆమాట అన్నతీరుబట్టి నిజం చెప్పడంలోని ప్రమాదం భాస్కరావుకి అర్థమైపోయింది - "నేనెందుకిస్తాను?"

భర్త తనకబద్ధం చెప్పడని రాధ నమ్మకం - "కాస్త వెతికి పెట్టండీ - అవతల ఆఫీసు టైమైపోతోంది..." అంది.

వెతకడంవల్ల ప్రయోజనముండదని తెలిసినవాడు కాబట్టి - "ఎందుకు - ఇప్పుడు వెతకడం? నీ స్నేహితురాలికేదో సమాధానం చెప్పేద్దూ!" అన్నాడు భాస్కరావు.

"పోనీ - ఇంట్లోంచి ఇంకేదైనా పుస్తకం, పత్రిక తీద్దామంటే అన్నీ చదివేసినవే?" అంది రాధ.

"ఈవేళ పేపరువాడు కూడా కొత్త పత్రికలేమీ ఇవ్వలేదు..."అంటూ అందించాడు భాస్కరావు.

"అసలిక్కడ పెట్టిన పుస్తకం ఎలా మాయమయిందంటారు?" అంది రాధ అనుమానంగా.

భాస్కరావోక్షణం ఆలోచించి - "పొద్దున బాగా తీరుబడి అనిపించి - బీరువా సర్దానులే!" అన్నాడు.

"మీకెప్పుడూ ఇలాంటి అయిడియాలే వస్తాయి నా ప్రాణాలు తీయడానికి...." అంది రాధ విసుగ్గా.

"సారీ రాధా!"

"మీరు సారీ చెబితే మాత్రం నేనిప్పుడాఫీసుకెలా వెళ్ళేది?" అంది రాధ దిగులుగా.

"ప్రతి చిన్న విషయానికీ అలా దిగులు పడకు రాధా! అందరూ మనిద్దర్నీ అదృష్టవంతులని చెప్పుకుంటారు...."

రాధ ఒక్క క్షణం ఆలోచించి - “అన్నట్లు మీరీ రోజు సెలవు పెడతానన్నారు కదా! నన్నూ సెలవు పెట్టమన్నారు కదా.... ఓకే... మీ కోసం సెలవు పెట్టేస్తాను... అంది.

“కానీ సెలవు. అవసరమున్నప్పుడే పెట్టుకోవడం మంచిదని నువ్వే అన్నావు గదా!” అన్నాడు భాస్కరావు.

“అన్నాను కానీ చేతిలో నవల్లేకుండా ఆఫీసుకెళ్ళి ఏం చేయను?” అంది రాధ.

“అంటే?” అన్నాడు భాస్కరావు.

“అబ్బే - ఏం లేదు. మీ కర్థం కాదులెండి. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు సెలవు దొరికే మనం నిజంగా అదృష్టవంతులం కదా!” అంది రాధ మాటమారుస్తూ.

భాస్కరావు తన నిద్రగురించి భార్యకు చెప్పుకోలేనట్లే - ఆఫీసులో నవల చదవడం మినహాయించి తను వేరేపని చేయదని ఆమె కూడా భర్తకు చెప్పుకోలేదు.

తాము నియమించిన ఉద్యోగులనుంచి తాము కోరే పని ఏదో తెలియని ప్రభుత్వ కార్యాలయాలు దేశంలో ఎన్నో ఉన్నాయి. అటువంటి దేశంలోని ప్రజల అదృష్టం గురించి వేరే చెప్పక్కర్లేదు. కానీ ఆ ప్రజల్లో కొందరైన ఆ కార్యాలయోద్యోగులు మాత్రం తప్పక అదృష్టవంతులు.

✦ ✦ ✦